# మరదలుపిల్లలు

## జ్యోతివిశ్వనాథ్



పాపం చంద్రశేఖరానికి బ్యాంక్‌లో ఉద్యోగం దొరికింది. మొదటి జీతం తెచ్చి చేతులో పోసేదాకా తల్లి జయమ్మగారికే నమ్మకం కలగలేదు. "ఈ రోజుల్లో మహామహా వాళ్ళకీ దొరకని బ్యాంక్ ఉద్యోగం ఈ గుంటవెధవకి దొరికిందీ. కబుర్లకేం... రెండేళ్ళవాడైనప్పట్నుంచీ వాడలాగే వాగుతున్నాడు బిగిని" అనేశారు బామ్మగారు అప్పడాలు వత్తేస్తూ...కోడలు అలివేణితో. కానీ అలివేలికాస్త అనుమానం వచ్చింది. "నిజం కాదుకదా కొంపతీసి" అని.

ఆ అనుమానం రావటం...వెను వెంటనే భర్త వెంకటేశంగారిని ఆడపడుచింటికి తరమటం...ఆయనా విషయం ఆ మూలాగ్రం పరిశీలించి రూఢిగా నిజమేనని తేల్చడం క్షణాల్లో జరిగిపోయాయి.

అలివేణమ్మ గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. బుర్రలో ఆలోచన్లు రంగుల లాట్నంలా తిరిగాయి, అందుక్కారణం... ఆవిడ....స్వీట్ సెవెన్‌టీన్ అండ్ సిక్స్టీన్ డాటర్స్....రాధ... రమ. ఇద్దరు వయసొచ్చిన పిల్లలు ఇంట్లోఉన్నా....అమాయికంగా, మెత్తని స్వభావంతో వొట్టి పిచ్చివాడిలా కనిపించే మేనల్లిణ్ణావిడ ఏమాత్రం దృష్టిలో పెట్టుకోలేదు. ఆస్తిపాస్తులా .. పెద్దగా ఏంలేవు, పిల్లవాడు ఈ కాలానికి తగిన వాడుకాడు....అందుకే కనిపించినప్పుడల్లా రమ అతన్ని తెగఏడిపించి, చెవులకి తాటాకులు కడుతూంటే ఎప్పుడూ వారించలేదు సరికదా ...నవ్వుతూ ప్రోత్సహిస్తూన్నట్టే ప్రవర్తించేది. అలాటిదీనాడు హఠాత్తుగా....చంద్రశేఖరం....ప్రయోజకుడై, అంచెలంచెలమీద ఆఫీసరయిపోయే అలాటి ఉద్యోగం సంపాదించి కూర్చున్నాడు. ఈ సంగతి తెలిస్తే ఊళ్లోనేఉన్న తోటికోడలు, బావగారు మాత్రం ఊరుకుంటారా. వాళ్లకీ బి.య్యేస్సీ చదువుతున్న పద్మ ఉండనే ఉంది. పైగా వాళ్ళకీ, ఆడపడుచుకి స్నేహమూ కాస్త ఎక్కువాయె. జయమ్మ మనసు మంచిది. అన్నదమ్ములందు ప్రేమాభిమానాలున్నయ్ ఆ విడకి. రాధనో, రమనో .... చంద్రానికి చేసుకుంటే....ఆ పిల్లగురించి ఇక చింత పడనక్కర్లేదు. కానీ....ఎలా....ఆ పిల్లాడు ఒప్పుకోవాలి కదా. అలివేణి పొలిటీషియన్ బుర్ర చకచకా పనిచేసింది. అమ్మాయి లిద్దర్ని పిలిచి వార్నింగిచ్చింది గట్టిగా.

''బావని ఎగతాళిపట్టించకండి. మీకంటే పెద్దవాడు. పైగా ఉద్యోగస్థుడయాడు. మంచిగా మర్యాదగా చూడాలి, తెలిసిందా'' అని.

ఈ కాలం పిల్లలకి తెలివితేటలు మరీ ఎక్కువ. వాళ్ళు తల్లిభావం నూటికి నూరుపాళ్ళూ గ్రహించారు. వాళ్ళకీ రెండు రోజుల క్రితం 'బావ'ని చూసినప్పట్నుంచీ అదోలా ఉంది. అదివరకులా ''ఖరం బావా....'' అన బుద్ధి కాలేదు. బిగుసుకు పోయినట్టుండే అతగాడు పూర్వం అడవి మనిషిలా కనిపిస్తే ...ఇప్పుడు ''అమితాబ్ బచన్''లా కనిపించాడు. కొత్తగా కొనుక్కున్న బూట్లు తళతళ మెరిసిపోతున్నాయ్. మల్లె పువ్వులాటి తెల్ల షర్ట్‌లో ఛాతీ మగతనంతో మిడిసిపడుతోంది. అంతేగాదు ...ఇంకా ఇంకా.... ఏవో అనిపించాయి. ''పద్మేదో అందని'' శేఖరం చెపుతూంటే జెలసీ తన్నుకొచ్చింది అక్క చెల్లెళ్ళిద్దరికీ. ''ఒరేయ్ చంద్రుడూ మీ అమ్మ దోసావకాయ కావాలంది. పట్టికెడుమా ఇదిగో జాడీలో పెట్టాను'' అంటూ బామ్మ తెచ్చిస్తే ఒళ్లు మండింది రాధకి. చంద్రుడూ ఏవిటి ఛా....ఛా....శేఖర్ అంటే బావుంటుంది ముచ్చటగా అనుకుంది. జాడీ ఎలా పట్టి

కెడతాడు ప్పాపం....అనుకుంటూ అంద మైన ప్లాస్టిక్ బాగ్‌లో చుట్టి అందించింది రమ - బావ కంగారుపడుతూ తాంక్స్ చెప్తూంటే అతితియ్యగా అచ్చు "బాబీ"లా నవ్వేసింది.

"రేపు దీపావళికి మావయ్యలిద్దరూ పిలిచార్రా. పొద్దున్న వెంకటేశు ఇంటికీ, సాయంత్రం సుబ్బారావింటికీ వస్తానని చెప్పాను." అని తల్లి అంటూంటే శేఖర్ గుండెల్లో రాయిపడ్డది. అతనికి సంతోషం లేకపోలేదు. కానీ....అదేమో. భయంలాటి దావహిస్తోంది మావయ్యలింటి కెళ్ళాలంటే. మునుపు. అమ్మ ఏదైనా పనిచెప్తే వాళ్ళిళ్ళకి వెళ్ళినవాడు అదేదో మూడు నిమిషాల్లో ముగించుకుని మరదళ్ళు చేసే హాస్యాలు ఆ చెవిని విని ఈ చెవిని వదిలేసి పరిగెత్తుకొచ్చేవాడు. కానీ ఇప్పుడు పరిస్థితివేరు .... వెడితే రానివ్వరు. దండిగా ఫలహారాలు, అత్తలు ఆప్యాయంగా చెప్పే కబుర్లు, అమ్మాయిలు చిందించే అందాల చిరునవ్వులూ....ఎంత సేపైనా కూర్చోవాలనే అనిపిస్తుంది. ముఖ్యంగా రాధ ఎదురుగా....తనకి రాధంటే బోలెడిష్టం....ఆ పిల్ల నల్లటి కళ్లు....ఇంకా నల్లటి బారెడు నొక్కుల జుత్తు, అతి ఎర్రటిపెదాలు....అబ్బ.... ఎంతబావుంటుంది రాధ. నెమ్మదిగా మాట్లాడుతుంది. మృదువుగా నవ్వుతుంది. కానీ, ఆవిడగారి పక్కనే రమ ఉంటుందే రమ కూడా బానే ఉంటుంది. జుత్తు భుజాల దాకా కత్తిరించుకుంది....ఎప్పుడు జార్జెట్ చీరలు కట్టుకుని .లోనెక్ బ్లౌజులూ



'మాయింటి దేవుడు' లో విజయలలిత

శేఖర్‌కి ఫాషన్స్ అంత నచ్చవు కానీ రమకి నప్పుతాయి అవన్నీ అనిపిస్తుంది. కానీ పిసింద్రీ....సీమటపాకాయ ...నోరు మెదిపితే ఏదో అంటుంది, కొంటెపిల్ల. ఈ మధ్య బాగానే ఉంటోందెందుకో. పెద్దదవుతోంది కదా.... తెలుసుకుంటుంది. మరి. పద్మ అదేటైప్ సినిమాలపిచ్చి! అతి నాజూగ్గా. గాలేస్తే పడిపోయేలా ఉన్నా తీరైన ముక్కూ అదీ. అసలు "అమ్మాయిలంతా బావుంటారా" అనిపిస్తుంది శేఖర్‌కి.

అమ్మ పెళ్ళి చేసుకోమని పోరుపెడుతోంది. వీళ్ళలో ఎవర్నైనా చేసుకుంటే.... ఎవర్ని .రాధనా మరి రమ, పద్మవాళ్ల

....వాళ్ళ గురించి మరిచిపోవచ్చా....ఏమో ....అయినా మావయ్య అడగాలి కదా. తనెలా అడుగుతాడూ.... పోనీ అమ్మకి చెప్తే .... ఊహుం .... అమ్మ నవ్వదూ. అయినా మగపెళ్ళివారు వెళ్ళి అడగట మేవిటో .. ఛా .. వెంకటేశు మావయ్యడిగితే బాగుండును.

పదిదాకా దుప్పటీ కదల్చని కొడుకుని అతి ప్రయాసమీద లేపి, తలంటి పోసింది జయమ్మ. కొత్తగా కొన్న స్కిన్ ఫిటింగ్ షర్ట్ తొడుక్కున్నాడు శేఖర్. కర్చీఫ్‌లో కొత్త సెంటు నింపుకున్నాడు.

"ఏవిటమ్మా ఇంతాలస్యం .... అంతా కవిపెట్టుక్కూర్చున్నాం రండి" వాకిట్లోనే ఎదురై ఆహ్వానించాడు చెల్లెల్ని వేంకటేశం.

"నీ మేనల్లుడు తెలివిలేసరికీ వేళయిం యిందిరా" నవ్వుతూ వంటింట్లోకి తల్లి దగ్గర కెళ్ళింది జయమ్మ.

లోపలికి అడుగుపెట్టిన శేఖర్ కళ్ళు జిగేల్ మన్నాయ్. ఎర్రటి రంగుమీద తెల్ల పువ్వులున్న నైలాన్‌చీర కట్టుకుని రాధ మందారాలు, మల్లెలు కుప్పపోసి నట్టుంది. జడనిండా జాజిపూలు దండిగా పెట్టుకుంది. రమ లేత నీలిరంగు డ్రెస్‌లో రోజా కంటే చాలా బాగుంది.

"రా బావా! గదిలో కూర్చుందుగాని" డ్రాయింగ్ రూమ్‌లోకి తీసికెళ్ళింది రమ. ఫాన్ వేసింది. రాధ చల్లటినీళ్ళు తెచ్చింది గ్లాసుతో.

"థాంక్సు ..." గడగడా గ్లాసెడు నీళ్లు ఖాళీచేశాడు.

"ఫిలింఫేర్ చూశావా ఈసారిది....మీ జయభాదురీది మంచిఫోటో పడింది" రమ చిలిపిగా నవ్వుతూ పుస్తకం అందించింది. తనకి బాగా దగ్గిరగా నిలబడి అలమారు లోంచి రాధ ఏదో తీసుకుంటూంటే శేఖరంకి ఉక్కిరిబిక్కిరయినట్టుంది. పుస్తకం పేజీలు తిరగేస్తూ ఓరగా ఆమెకేసి చూస్తున్నాడు. సన్నటి నడుం .... గుండ్రటి బుజాలు....నో . నో. తనకేవిటో ఆలోచన్లు ..

"మీ అత్తయ్య వడ్డించేసింది లేవరా" మావయ్య పిలుపులాటి గర్జనకి చటుక్కున లేచి నిలబడ్డాడు.

ఇష్టమయిన చక్కెర పొంగిలిలో రాధ వేసిన మరింత నెయ్యి కలుపుకుని తింటున్న శేఖర్ అమ్మమ్మ మాటలకి ఉలిక్కిపడ్డాడు.

"పద్మని చేసుకుంటా నన్నావటగా చంద్రుడూ ...దాన్ని కాకపోతే రాధనో, రమనో చేసుకోగూడదూ. చిన్నప్పట్నుంచీ చూపిన ఈ మావయ్య చేదైనాడట్రా" అని పిడుగులు రాల్చింది అమ్మమ్మ.

"ఎవరమ్మా అన్నదీ.వాడలా అనందే. ఆ మాటే రాలేదసలు" జయమ్మ అన్నది.

"అనలామరి సుబ్బడలా అంటాడేం. అయినా జయా! వాడికేమే - ఒక్కత్తే కూతురు. ఈ పిల్లలిద్దరికీ ఏం తక్కువయిందీ! ఎవర్నో ఒకర్ని చేసుకుని మీరొకటైతే నాప్రాణం హాయిగ ఉంటుందే" కూతుర్ని అనునయించిం దావిడ. ఇన్నాళ్లు రాని ఇలాటి ప్రసక్తి లెందుకొస్తున్నాయో తెలుసుకోలేని అమాయకురాలు కాదు జయమ్మ. కానీ ఆవిడ మనుషుల్ని తేలిక చెయ్యలేదు.



"వాడి కిష్టమయితే నాదేమిటమ్మా" అందావిడ.

"వాడు నీమాట వినడుటే" బామ్మ గారు సాగదీసింది.

"నెమ్మదిగా మాట్లాడుకుందాం నువ్వూరుకో అమ్మా" వెంకటేశం తెలివిగా ఆపాడా ప్రసంగం. ఆ టాపిక్ రాగానే ముగ్గల్లా అయిపోయి తలలు వొంచేసుకున్న అమ్మాయిలు నిరుత్సాహపడ్డారు. శేఖర్ ఎటు చూడకుండా శ్రద్ధగా భోంచేస్తూ, రమా... రాధా... ఎవరు... ఎవర్నని చెప్పాలి అని ఆ క్షణం తేల్చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

భోజనా లయాక .... పెద్దలు నడుం వాలిస్తే .... బావా మరదళ్ళు పేకాడారు. మావయ్య దరిదాపుల్లో లేడని తేల్చుకుని సిగరెట్ ముట్టించాడు శేఖర్. మంచం మీద దిండు కానుకుని వాలికూర్చుని సిగరెట్ కాలుస్తూ, పేకముక్కలు పట్టుకున్న బావ హీరో లందర్లో హీరోలా కనిపించాడు రమకి. పేకాడటం అయ్యాక ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. పువ్వులవాడు పిలుస్తూంటే రాధ వెళ్ళింది కొనటానికి.

"నేను అప్పుడు నిన్ను టీజ్ చేసానని నామీద కోపం లేదుకదు బావా" జాలిగా చూస్తూ అడుగుతున్న రమని తదేకంగా చూశాడు; నవ్వాడు.

"ఛా అదేంలేదు రమా!" అనేశాడు.

"నిజంగా...." సంతోషం పట్టలేనట్టు అడిగింది.

"నిజం."

"ఏమో బావా నాకు నమ్మకం లేదు" అంతలోనే బుంగమూతి పెట్టింది.

మళ్ళీ నవ్వాడు శేఖర్.

"మరేంచేస్తే నమ్ముతావు" అన్నాడు.

''ఏదైనా చెయ్యకూడదూ నమ్మించ డానికి''

క్షణం ఆశ్చర్యంగా చూసి, మరిక లాభంలేదన్నట్టు మంచానికటు చివర కూర్చున్న రమకేసి జరిగి బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు. గమ్మున దూరమయ్యాడు. అప్పుడే రాధ లోపలికొచ్చింది

రమ మనసు గంతులేస్తోంది. బావ ఇక తనవాడే అనుకుంది ఖచ్చితంగా. శేఖర్ అంతకుముందు జరిగిన ఆచిన్ని సంఘటన నిజమేనా అని ఆశ్చర్యపోయాడు. రాధకి ద్రోహం చేశానా అన్నట్టు ఆమెకేసి చూసి బోలెడుసార్లు నవ్వాడు.

ఆమె మొహం కడుక్కోవటాని కెళ్ళి నప్పుడు రాధ పళ్ళెంనిండా వేడివేడి పకోడీలు తెచ్చింది. కాఫీగ్లాసిస్తూ.

''వేడిబావా, పైన పట్టుకో'' అంది.

టేబిల్‌మీద పెట్టమందా మనుకున్న శేఖర్ అంతలో రాధ చిన్నబుచ్చుకుంటుం దేమో అనుకుంటూ ఆమె వేళ్లుతాకుతూ గ్లాసు అందుకున్నాడు. మనోహరంగా సిగ్గుపడుతూ నవ్వింది.

సాయంత్రం సుబ్బారావు మామయ్య ఇంట్లో వాళ్ళుచేసిన హడావిడి అంతాఇంతా కాదు. జయమ్మకి విసుగే అనిపించింది. శేఖర్ పద్మతో కులాసాగా కాలం గడి పాడు.

''అబ్బ టపాకాయలంటే నాకు భయం బావా'' అంది పద్మ అతిగారంగా. పెద్ద పీడుడిలా నవ్వేస్తూ శేఖర్ ఆటంబాంబులు కూడా కాల్చాడు. కాకరపువ్వత్తులు వెలిగించి అతని చేతిదగ్గర పెట్టింది చురుక్కుమనేలా. ఆమెచెయ్యి గట్టిగా పట్టుకొని ఆపాడు.

''ఏయ్‌బావా. వొదులు. మా నాన్నతో చెప్తా.''

''చెప్పు నాకేం భయం'' అన్నాడు నవ్వుతూ.

''ఏమిట్రా అప్పుడే దానిచెయ్యి పట్టుకున్నావు'' హాల్లోంచి చూస్తూన్న మావయ్యని చూసి చటుక్కున వదిలేశాడు.

''ఇకచాలు అన్నాలకి రండి'' అన్నాడాయన నవ్వుతూ.

భోజనాలయి తాంబూలాలు వేసుకుని అంతా కూర్చున్నప్పుడు సుబ్బారావు పద్మని శేఖరానికి చేసుకోమని జయమ్మ నడిగాడు.

''పోనాన్నా .. నాకేంపెళ్లొద్దు''అంటూ గదిలోకి తుర్రుమంది పద్మ.

''వాణ్ణే అడగరా'' అంది జయమ్మ ముభావంగా.

''వాడి సంగతి నాకు తెలియదుటే నువ్వెంత చెప్తే అంత ''

అలా అనకు, మధ్యాహ్నం వెంకటే శన్నయ్యకూడా అడిగాడు వాళ్ళ పిల్లల్ని ఎవర్నో ఒకర్ని చేసుకోమని. నాకు మాత్రం మనవాళ్ళని కాదని పైకి వెళ్ళాలని ఉందా! వాడికే పిల్లనచ్చితే దాన్నే చేసుకోవచ్చు'' నెమ్మదిగా చెప్పింది.

''ఏమోయ్ స్వయంవరం ఏర్పాటు చెయ్యమంటావా'' తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అన్నాడు సుబ్బారావు.

''అబ్బే! లేదు మామయ్యా'' నసిగాడు శేఖర్.

''వాణ్ణి నేను కనుక్కొని చెప్తాలే'' జయమ్మ అన్నది.

''అమ్మాయి బావంటే ఇష్టం పెంచుకుంది. అందుకే వదినా మాతాపత్రయం''

సోం. ని

పద్మతల్లి వరలక్ష్మి అంది.

మీ తాపత్రయందేనికో నాకు తెలుసు అనుకుంటూ పైకి నవ్వింది జయమ్మ.

శేఖరానికి ఇరవైనాలుగ్గంటలూ ఒకే ఆలోచన. ముగ్గురి మరదళ్లలో ఎవర్ని చేసుకోవాలీ అని. అతని మనస్సెక్కువ రమ వైపు మొగ్గుతోందిప్పుడు. ఆ రోజు పండగనాడు, తన కెలా వచ్చిందంత ధైర్యం అని బోలెడు ఆశ్చర్య పడిపోతాడు. కానీ రాధ. పద్మ గుర్తొస్తే మళ్లీ ఆలోచన ప్రారంభం. పాపం మామయ్యలిద్దరూ తన మీద ఆశ పెట్టుకున్నారు. ఎవర్ని నొప్పించాలన్నా బాధే.

జయమ్మ ఓ రోజు కొడుకుతో మాట్లాడుతూ—

''రాధయితే నీకన్నివిధాల తగినదిరా'' అని తన అభిప్రాయం చెప్పింది. దాంతో సమస్య మరింతయింది.

కానీ అన్ని సమస్యలు మరో నెల తిరిగే వరకి సమసి పోయాయి. అమెరికాలోనే సెటిలయి పోతారనుకున్న జయమ్మ చెల్లెలు—లలితమ్మగారి ఫేమిలీ ఇండియా వచ్చేశారు. ఆవిడకీ ఒక్కడే కొడుకు కిరణ్. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదివి పెద్ద కంపెనీలో ఉద్యోగంతో వచ్చాడతను.

తమ కళ్ళముందే అన్నలిద్దరూ కిరణ్‌ని ఎలాగైనా తమ అల్లుణ్ణి చేసుకోవాలని ప్రయత్నాలు జోరుగా సాగించటంతో— జయమ్మ మనసు విరిగి పోయింది. శేఖరం ఆశ్చర్యపోయి అలాగే వుండి పోయాడు. పరిస్థితుల్లో ఒచ్చిన మార్పులు అతని అమాయకపు హృదయానికి అవగాహన కాలేదు.

పురోహితుడుగారు చెప్పిన సంబంధం చూసి, తల్లి అంగీకరించి నప్పుడు శేఖర్-లక్ష్మి మెడలో తాళి కట్టాడు. మరో నెల తిరక్కుండా కిరణ్ పంజాబీ అమ్మాయిని లవ్‌మేరేజ్ చేసుకున్నాడు.

మరదలు పిల్లలు .... ఆశపడేందుకు మరిక బావల్లేరు. ★

---

## బ్రతుకు—

రోడ్డులా సాగిపోతున్న కళ్ళు
ఎక్కడికక్కడ గమ్యం వెతుక్కుంటున్న కాళ్ళు
కళ్ళు-ధ్యేయం
కాళ్ళు-జీవితం.

—దేవరాజు మహారాజు